RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రస్థానం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
అర్హతలు:
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386

హైదరాబాద్ | శుక్రవారం 11-9-2026 | సంచిక: 13 | సంఖ్య: 344 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి



## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి..

### ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

అసెంబ్లీ కార్యకలాపాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ

అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదని వ్యాఖ్య

ప్రతిపక్షాల కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలకు పిలుపు

ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

2లో

# 22ఏపై రగడ..

## మండలి నుంచి బీఆర్ఎస్ వాకౌట్

22ఏపై చర్చకు నో.. మండలిలో బీఆర్ఎస్ నిరసన.. వాకౌట్

వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన మండలి చైర్మన్

పోడియం వద్దకు చేరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

పత్రాలు చించి నినాదాలతో సభలో హైడ్రామా




**22ఏ భూముల అంశం శాసనమండలిలో మరోసారి రాజకీయ వేడిని పెంచింది. ఈ వ్యవహారంపై సభలో చర్చించేందుకు అవకాశం కల్పించాలన్న బీఆర్ఎస్ డిమాండ్‌కు అనుమతి దక్కకపోవడంతో ప్రతిపక్ష ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. తమ అభ్యర్థనను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ చివరకు మండలి నుంచి బయటకు వెళ్లారు.గురువారం మండలి సమావేశాలు ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు 22ఏ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు.**

హైదరాబాద్: ఈ అంశంపై తక్షణ చర్చ అవసరమని పేర్కొంటూ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. భూములకు సంబంధించిన సమస్యపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే చైర్మన్ వారి ప్రతిపాదనను తిరస్కరించడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. తీర్మానానికి అనుమతి నిరాకరించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తీవ్రంగా స్పందించారు. సభలో తమ డిమాండ్‌ను కొనసాగిస్తూ కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. అనంతరం పలువురు సభ్యులు చైర్మన్ పోడియం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేయడంతో సభా వాతావరణం ఉద్రిక్తంగా మారింది.



## చేతనైతే ఆపండి!

- ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహిస్తా.. జగన్‌కు నారా లోకేశ్ సవాల్
- మెగా డీఎస్సీపై జగన్ ఆరోపణలు
- ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి 3,000 పోస్టులు భర్తీ చేస్తామని వెల్లడి
- ఐదేళ్లలో మొత్తం 30,000 టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసే బాధ్యత తమదేనని స్పష్టీకరణ
- ఉపాధ్యాయులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- త్వరలోనే తదుపరి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడి

2లో



2లో

## ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి..

### టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి: సీఎం చంద్రబాబు

8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కొత్త తరం నాయకత్వ పద్ధతులు అలవర్చుకోవాలని కలెక్టర్లకు సూచన

పరిపాలనలో ఏఐ, టెక్నాలజీ వినియోగంతో కచ్చితమైన ఫలితాలు సాధించాలని నిర్దేశం

అధికారులు, నేతలకు విశ్వసనీయతే అత్యంత ప్రధానం అన్న సీఎం

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలోచనా విధానం మార్చుకోవాలని పిలుపు

**ప్రజల ఆశలు, అంచనాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, కొత్త తరం నాయకత్వ పద్ధతులను (న్యూ ఏజ్ లీడర్షిప్) అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పరిపాలనలో టెక్నాలజీని అందిపుచ్చుకుని, వేగవంతమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో "లీడర్షిప్ – న్యూ ఏజ్ గవర్నెన్స్" అనే అంశంపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.**

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "గతంలో అనేక అంశాలపై దృష్టి సారించినా, ఇప్పుడు ప్రధానంగా నాయకత్వంపైనే ఆలోచించాలని నిర్ణయించాం.

## చీపురుపల్లి సమావేశంలో కన్నీళ్లు పెట్టుకున్న బొత్స సత్యనారాయణ

మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరడంతో బొత్స సత్యనారాయణ భావోద్వేగం

చీపురుపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కంటతడి పెట్టిన బొత్స

వ్యక్తులు వస్తుంటారు పోతుంటారు, పార్టీనే శాశ్వతమంటూ కేడర్‌కు ధైర్యం



వైసీపీ సీనియర్ నేత, ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్ర

2లో



### సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే

## ఈ దుస్థితా?

విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందన్న కేటీఆర్

పాతకాలపు కరెంట్ కోతలు పునరావృతమవుతున్నాయని విమర్శ

రేవంత్ సొంత గ్రామంలోనే రైతులు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారన్న కేటీఆర్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని...

2లో



## 17 లక్షలకు పైగా లబ్ధిదారులకు డిజిటల్ హెల్త్ కార్డులు

ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్‌లో కొత్త సదుపాయాలు.. డిజిటల్ కార్డులతో మరింత ఈజీ

ఈహెచ్ఎస్ కోసం ఏటా రూ.1,056 కోట్ల కేటాయింపు

921 ఆసుపత్రుల్లో నగదు రహిత ఇన్‌పేషెంట్ చికిత్సకు అవకాశం

## రాహుల్‌కు ఇటాలియన్‌లో లేఖ..

- ఫీజు బకాయిలపై బీజేపీ చీఫ్ వినూత్న నిరసన
- ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై వినూత్నంగా నిరసన
- విద్యార్థులకు మద్దతిస్తే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని విమర్శ
- కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చలేదని విమర్శలు



2లో

## నాగబాబుకు కేబినెట్ హోదా..

నెలకు రూ. 4.50 లక్షల జీతభత్యాలు!

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబుకు కేబినెట్ హోదా

జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను ఖరారు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

నెలకు రూ. 2 లక్షల జీతం.. రూ. 2.50 లక్షల అలవెన్సులు

మొత్తం రూ. 4.50 లక్షల మేర ప్రయోజనాలు అందే అవకాశం



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

### 17 లక్షలకు పైగా లబ్ధిదారులకు
# డిజిటల్ హెల్త్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, సెప్టెంబర్ 10: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈహెచ్ఎస్ సేవల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ ఆరోగ్య కార్డులు అందించడంతోపాటు, ఓటీపీ ఆధారంగా వాటిని డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన వైద్య సేవలు పొందేలా వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో గురువారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ ఈహెచ్ఎస్ కొత్త విధానం జులై 17 నుంచి అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రస్తుతం 17 లక్షలకు పైగా మంది ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. ఈహెచ్ఎస్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.1,056 కోట్లను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ప్రతి నెల రూ.88 కోట్ల మేర నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ వంతుగా 1.5 శాతం చెల్లిస్తే, ప్రభుత్వం కూడా అదే స్థాయిలో తన వాటాను సమకూరుస్తుందని వివరించారు. వైద్య చికిత్సల కోసం అందుబాటులో ఉన్న ఆసుపత్రుల సంఖ్యను కూడా మంత్రి వెల్లడించారు. మొత్తం 921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ సేవలు పొందే అవకాశం ఉందన్నారు. ఇందులో 114 ప్రభుత్వ ఆసుపత్రులు కాగా, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు స్థానికంగానే ప్రాథమిక ఆరోగ్య సేవలు అందేలా వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటును ప్రభుత్వం చేపడుతోందని రాజనర్సింహ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 37 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటికే 12 జిల్లాల్లో 12 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. మిగిలిన 25 కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంద ̆న్నారు. కొత్త ఈహెచ్ఎస్ విధానంలో చికిత్సల కోసం ఇప్పటివరకు 8,511 కేసులకు ప్రీ-ఆథరైజేషన్ మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. వీటి విలువ రూ.55.14 కోట్లుగా ఉందని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

### ప్రజల అంచనాలకు తగ్గట్టు
# కలెక్టర్లు మారాలి..



సరైన నాయకత్వంతోనే వేగంగా ఫలితాలు సాధించి, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకోగలం. నాయకత్వం అనేది స్వీయ ప్రేరణ. ఈ విషయంలో మహిళలు, పురుషులు అనే వ్యత్యాసం చూడటం పాత కాలపు పద్ధతి" అని అన్నారు. ప్రస్తుతం నాయకత్వ మార్పు దశలో ఉన్నామని, అందరూ కొత్త నాయకత్వ పంథాను అనుసరించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థలు కూడా రూపాంతరం చెందుతున్నాయని, ఈ క్రమంలో అధికారులు, రాజకీయ నేతలకు విశ్వసనీయతే అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. నైపుణ్యాలకు నిరంతరం పదును పెట్టుకోవడం ద్వారానే వృత్తిలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, "నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియగా మారాలి. ఆన్‌లైన్‌లో ఫైళ్ల నిర్వహణ, అవేర్, డేటా లేక్ వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా కచ్చితమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలి" అని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ పారిశ్రామికవేత్తలు అత్యుత్తమంగా రాణిస్తున్నారని, ఏ వ్యవస్థలోనైనా ఇమిడిపోయే తత్వం భారతీయుల సొంతమని, ఆ స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని ఆకాంక్షించారు.

### బీఆర్ఎస్ కుట్రలను
# తిప్పికొట్టండి..

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

### చీపురుపల్లి సమావేశంలో
## కన్నీళ్లు పెట్టుకున్న బొత్స సత్యనారాయణ

(మొదటి పేజీ తరువాయి)

భావోద్వేగానికి గురయ్యారు. తన మేనల్లుడు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) టీడీపీలో చేరడంపై స్పందిస్తూ ఆయన కంటతడి పెట్టారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఈ ఉద్విగ్నభరిత వాతావరణం చోటుచేసుకుంది. చిన్న శ్రీనుతో తనకున్న అనుబంధాన్ని, కార్యకర్తలతో అతనికి ఉన్న సంబంధాలను గుర్తుచేసుకుంటూ బొత్స ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సమావేశంలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. అనంతరం తేరుకున్న ఆయన, కార్యకర్తలకు ధైర్యం నూరిపోశారు. "రాజకీయాల్లో వ్యక్తులు వస్తుంటారు, పోతుంటారు. కానీ పార్టీ శాశ్వతం. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కొందరు పార్టీలు మారుతుంటారు. ఎవరూ అధైర్యపడొద్దు" అని ఆయన పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి ఆశయాల సాధన కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని, తాను, ఇతర సీనియర్ నేతలు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయి బాధ్యతల్లో తాను బిజీగా ఉండటంతో జిల్లా, నియోజకవర్గ బాధ్యతలను పూర్తిగా చిన్న శ్రీనుకే అప్పగించానని బొత్స గుర్తుచేశారు. అయితే, కనీసం కార్యకర్తలకు కూడా సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా పార్టీ మారడం అందరినీ షాక్‌కు గురిచేసిందని పలువురు నేతలు అన్నారు.

# 22ఏపై రగడ..

(మొదటి పేజీ తరువాయి)

నిరసనలో భాగంగా కొందరు బీఆర్ఎస్ సభ్యులు తమ వద్ద ఉన్న పత్రాలను చించి గాల్లోకి విసిరారు. 22ఏ అంశంపై చర్చకు అవకాశం ఇవ్వకుండా సభా కార్యక్రమాలను కొనసాగించడాన్ని వారు తప్పుబట్టారు. ప్రతిపక్షం ప్రస్తావిస్తున్న అంశానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తమ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. బీఆర్ఎస్ సభ్యుల నిరసనతో మండలిలో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఛైర్మన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్సీలు తమ నిరసనను కొనసాగించారు. 22ఏ అంశంపై చర్చ జరగాల్సిందేనన్న పట్టుదలతో వారు సభా కార్యకలాపాలకు అడ్డు తగిలే విధంగా పోడియం సమీపంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలుమార్లు నినాదాలు చేశారు. తమ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడాన్ని బీఆర్ఎస్ సభ్యులు తీవ్రంగా తప్పుపట్టారు. 22ఏ భూముల సమస్యను సభలో చర్చించకుండా పక్కన పెట్టడం సరికాదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఛైర్మన్ నిర్ణయంలో మార్పు రాకపోవడంతో బీఆర్ఎస్ సభ్యులు తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకున్నారు. సభలో కొనసాగడం కంటే నిరసనగా బయటకు వెళ్లడమే సరైనదని భావించారు. ఈ మేరకు మండలి నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. వాకౌట్‌కు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మరోసారి తమ డిమాండ్‌ను స్పష్టం చేశారు. 22ఏ కింద ఉన్న భూములకు సంబంధించిన అంశంపై సమగ్రంగా చర్చ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించేందుకు ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యులు ఒక్కొక్కరుగా మండలి వెలుపలికి వెళ్లారు. సభలో నిరసనతో పాటు వాకౌట్ ద్వారా తమ రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు. దీంతో 22ఏ అంశం చుట్టూ అధికార, ప్రతిపక్షాల మధ్య విభేదాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. ఇటీవల 22ఏ భూముల అంశంపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీల నుంచి ఆందోళనలు, డిమాండ్లు వ్యక్తమవుతున్న నేపథ్యంలో శాసనమండలిలో చోటుచేసుకున్న పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సభలో చర్చకు అవకాశం కల్పించాలన్న బీఆర్ఎస్ పట్టుదల, దానికి ఛైర్మన్ నుంచి అనుమతి రాకపోవడం, అనంతరం సభ్యుల నిరసనతో గురువారం మండలి సమావేశాల్లో రాజకీయ ఉత్కంఠ నెలకొంది.

# సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాతకాలపు కరెంటు కోతలు పునరావృతమవుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకుంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా వోల్టేజ్, సమయానికి కరెంటు రాకపోవడంతో పొలాలకు నీళ్లు పారక పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు.

## సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఆయన ఉల్లంఘిస్తున్నారంటూ ప్రముఖ మ్యూజిక్ సంస్థ 'సరిగమ' దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఈ సందర్భంగా ఆదేశించింది. సరిగమ సంస్థ తాజాగా దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఇళయరాజాపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. తాము కాపీరైట్లు హక్కులు కలిగి ఉన్న పాటలను ఆయన వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని, తద్వారా గతంలో కోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా అతిక్రమిస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు ఇళయరాజాపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని విన్నవించింది. అంతేకాకుండా, ఆయన ఆస్తులను జప్తు చేసి, వాటి విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును తమకు చెల్లించాలని కూడా పిటిషన్‌లో కోరింది. గతంలో ఇళయరాజా స్వరపరిచిన పలు చిత్రాల పాటలకు సంబంధించిన కాపీరైటు హక్కులు తమకే దక్కుతాయని, అయినప్పటికీ ఆయన ఆ హక్కులను క్లెయిమ్ చేస్తూ వాణిజ్యపరంగా వాడుకుంటున్నారని సరిగమ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అప్పట్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఈ వ్యవహారంపై స్టే విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, ఆ స్టే ఉత్తర్వులను ఇళయరాజా బేఖాతరు చేస్తున్నారని సరిగమ తాజాగా ఆరోపించింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు, ఈ ఫిర్యాదుపై స్పందించాలని ఆదేశిస్తూ ఇళయరాజాకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# నాగబాబుకు కేబినెట్ హోదా..

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు)కు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జీతభత్యాలు, వ్యక్తిగత సిబ్బంది నియామకం, ఇతర ప్రయోజనాలను ఖరారు చేస్తూ పర్యావరణ, అటవీశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల కాపీలను ఆర్థిక శాఖ సహా సంబంధిత శాఖలకు పంపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో, కేబినెట్ హోదా పొందిన వారికి వర్తించే ప్రయోజనాలకు సంబంధించి 2025 జనవరి 10న విడుదల చేసిన జీవో నంబర్ 7ను ప్రస్తావించారు. ఈ జీవో ప్రకారం కేబినెట్ హోదాలో ఉన్న వారికి నెలకు రూ. 2 లక్షల జీతం చెల్లిస్తారు. దీనికి అదనంగా, కార్యాలయ ఫర్నీచర్ ఏర్పాటు, వ్యక్తిగత సహాయ సిబ్బంది అలవెన్సులు, ఇతర సౌకర్యాల కల్పన కోసం వన్‌టైం గ్రాంట్‌గా మరో రూ. 2.50 లక్షలు అందిస్తారు. దీంతో జీతం, అలవెన్సులు అన్నీ కలిపి నెలకు మొత్తం రూ. 4.50 లక్షల వరకు ప్రయోజనాలు అందనున్నాయి. నాగబాబుకు కూడా ఇదే ప్యాకేజీ వర్తిస్తుందని స్పష్టమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే పలువురిని కేబినెట్ హోదాలో నియమించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా నియమితులైన పెందుర్తి వెంకటేశ్, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌లకు కేబినెట్ హోదా ఉంది. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, ప్రకృతి వైద్య నిపుణుడు మంతెన సత్యనారాయణ రాజు, మాజీ కార్టూనిస్ట్ పోచంపల్లి శ్రీధర్ రావులకు కూడా ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఇప్పుడు ఈ జాబితాలో నాగబాబు కూడా చేరారు.

# రాహుల్‌కు ఇటాలియన్‌లో లేఖ..

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టిని ఆకర్షించేందుకు బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. రామచందర్ రావు వినూత్న నిరసన చేపట్టారు. బుధవారం ఆయన రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాశారు. రాష్ట్రంలో సాగుతున్న ఆందోళనలు, విద్యార్థుల నిరసనలు, పోలీసుల లాఠీఛార్జులు, అరెస్టులు వంటివేవీ రాహుల్ గాంధీని గానీ, తెలంగాణ ప్రభుత్వాన్ని గానీ కదిలించలేకపోయాయని, అందుకే ఆయన "మాతృభాష" అయిన ఇటాలియన్‌లో లేఖ రాస్తున్నట్లు రామచందర్ రావు ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కొరతతో విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, సిబ్బంది కూడా అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థులకు మద్దతుగా నిలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు, పోలీసు చర్యలతో అణచివేస్తోందని రామచందర్ రావు విమర్శించారు. సమస్య పరిష్కారం కోసం గళమెత్తినందుకు గత 10 రోజుల్లోనే తనను నాలుగుసార్లు అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'యూత్ డిక్లరేషన్'లో ఇచ్చిన నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, విద్యా భరోసా కార్డుల వంటి హామీలను నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి బకాయిలన్నీ విడుదల చేయించాలని, విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

# చేతనైతే ఆపండి!

(మొదటి పేజీ తరువాయి)

మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి తీరుతామని, చేతనైతే ఆపాలని జగన్‌కు సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో సుమారు 30 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో లోకేశ్ ఓ వీడియో విడుదల చేశారు. "ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు... ఈ రోజు మాజీ ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీపై మళ్లీ ఆరోపణలు చేస్తున్నారు. నేను సూటిగా ప్రశ్నిస్తున్నా... డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి మధ్య తేడా మీకు తెలుసా? మీరు అధికారంలో ఉన్న ఐదేళ్లు మీరు భర్తీ చేసిన టీచర్ పోస్టులు సున్నా. అదే, మా ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే పెట్టారు. అందుకే మా ప్రజాప్రభుత్వం దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడం జరిగింది. డీఎస్సీపై మీరు అనేక పర్యాయాలు కోర్టుకు వెళ్లారు. మొన్న మీ ఎమ్మెల్సీ పిల్ వేసి సీబీఐ ఎంక్వైరీ కోరితే, కోర్టు తిరస్కరించింది. డీఎస్సీ ఆపాలని మీరు 300 కేసులు వేసినా, కోర్టు ఎక్కడా మమ్మల్ని తప్పుబట్టలేదు. మా విద్యాశాఖ అధికారులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, మీరు ఆరోపిస్తున్న ప్రతి అంశానికి అద్భుతంగా సమాధానం చెప్పారు. అయినాగానీ మీరు డీఎస్సీపై విషం కక్కడం చాలా బాధాకరం. ఈ మధ్య నేను చూస్తున్నాను.. మీ దొంగ పేపర్ విలేకరులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి, అక్కడున్న ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.. కొన్నిచోట్ల దాడులు కూడా చేస్తున్నారు. అలాంటివాళ్లను వదిలిపెట్టం, వాళ్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. ఉపాధ్యాయుల జోలికి ఎవరైనా వెళితే వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేస్తున్నాను. ఈ రోజు మీరు కుంభకోణాల గురించి మాట్లాడుతున్నారు. సరిగ్గా మూడేళ్ల క్రితం స్కిల్ డెవలప్ మెంట్ పథకంలో ఏదో కుంభకోణం జరిగిందని మా నాయకుడు చంద్రబాబును అర్ధరాత్రి అరెస్ట్ చేసి 53 రోజులు మీరు జైల్లో బంధించారు. ఈ మూడేళ్లలో న్యాయ ప్రక్రియ పూర్తయి, మా నాయకుడికి క్లీన్ చిట్ వచ్చింది. రెగ్యులేటరీ సంస్థలు కూడా చాలా స్పష్టంగా, ఎక్కడా అవినీతి జరగలేదని చెప్పాయి. మాకు గానీ, మా కుటుంబానికి గానీ, మా పార్టీకి గానీ ఎలాంటి అవినీతి సొమ్ము రాలేదని వాళ్లు తేల్చి చెప్పారు. జగన్ గారూ ఒకటే చెబుతున్నాను... యువగళం పాదయాత్రలో నేను నిరుద్యోగ యువతను కలిశాను. వాళ్ల సమస్యలను తెలుసుకున్నాను. అందుకే పట్టుదలతో, క్రమశిక్షణతో ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించదలిచాను. ప్రతి సంవత్సరం 3 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. ఈ ఐదేళ్ల ప్రజా ప్రభుత్వంలో దాదాపు 30 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసే బాధ్యత తీసుకుంటాం. నేను ఒకటే చెబుతున్నాను... చేతనైతే నన్ను ఆపండి చూద్దాం.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్.. త్వరలో కీలక భేటీ

### నదీమ్ కమిటీ నివేదిక తర్వాత సమస్యల పరిష్కారానికి చర్యలు

### ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటుపై సర్కారు కసరత్తు

### సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపైనా పరిశీలన

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నేటి ప్రస్థానం):** ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. ఈ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నా మని, దీనిపై త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నదీమ్ కమిటీ తన నివేదిక సమర్పించిన అనంతరం ఔట్‌సోర్సింగ్



సిబ్బందికి సంబంధించిన అంశాలపై నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో కనీస వేతనాల అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఈ విషయంలో తెలంగాణ దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి సంబంధించి కూడా మంత్రి కీలక సమాచారం వెల్లడించారు. వారి వేతనాలను పెంచే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను సూచించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నదీమ్ కమిటీని ఏర్పాటు చేసిందని వివేక్ వెంకటస్వామి తెలిపారు. కమిటీ నివేదిక అందిన తర్వాత దాని ఆధారంగా తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదే సమయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం సానుకూలంగా ఆలోచిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రతిపాదనకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.



# దొరల పెత్తనాన్ని ప్రశ్నించిన ధీరవనిత.. ఐలమ్మకు ఘన నివాళి

### రామచంద్రాపురంలో ఐలమ్మ విగ్రహానికి పుష్పాంజలి

### భూమి, భుక్తి, వెట్టి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం స్మరణ

### బలరాం ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించిన రజక సంఘం ప్రతినిధులు

**గుమ్మడిదల (రామచంద్రాపురం), సెప్టెంబర్ 10 (నేటి ప్రస్థానం):** అన్యాయానికి ఎదురొడ్డి నిలిచి అణగారిన ప్రజల తరఫున గళమెత్తిన చాకలి ఐలమ్మ పోరాటాన్ని రామచంద్రాపురం వాసులు స్మరించుకున్నారు. ఆమె 42వ వర్ధంతిని పురస్కరించుకుని 268వ డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్ కాలనీ బాలవిహార్ పార్క్ సమీపంలో ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. శ్రీ బాలాజీ ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు బలరాం నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో సామాన్య ప్రజలపై సాగిన పెత్తందారీ వ్యవస్థకు ఐలమ్మ సవాల్‌గా నిలిచారని బలరాం పేర్కొన్నారు. సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన ఆమె భయపడకుండా ఆధిపత్య వర్గాలను ప్రశ్నించారని, పేదలకు భూమిపై హక్కు, జీవనాధారం, వెట్టి వ్యవస్థ నుంచి బయటపడే స్వేచ్ఛ కోసం ఉద్యమించారని తెలిపారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పోరుబాట పట్టిన ఐలమ్మ తెగువ తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిందని ఆయన అన్నారు. ముఖ్యంగా రైతులు, నిరుపేదలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల కోసం ఆమె చూపిన నిబద్ధత ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలు తొలగి ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు అందేలా కృషి చేయడమే ఐలమ్మకు ఇచ్చే నిజమైన గౌరవమని బలరాం అన్నారు. ఆమె జీవిత చరిత్రను యువత తెలుసుకోవడంతో పాటు అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు సమర్పించారు. ఆమె త్యాగాలను గుర్తుచేసుకుంటూ రజక సంఘం నాయకులు, స్థానికులు తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం పట్టణ రజక సంఘం నాయకులు చాకలి నరసింహ, ప్రభు, చాకలి లింగయ్య, శ్రీనివాస్, సాయి, అంజయ్య, బిక్షపతి, కృష్ణ, సుధాకర్, కరిక కృష్ణ, తుకారం, అనిల్, సతీష్ తదితరులు పాల్గొని.. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సమానత్వం, ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# అణగారిన వర్గాలకు అండగా నిలిచిన వీరనారి.. ఐలమ్మకు ఘన నివాళి





### రామచంద్రాపురంలో ఐలమ్మ విగ్రహం వద్ద కాంగ్రెస్, రజక సంఘం నేతల పుష్పాంజలి

### అణగారిన వర్గాల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానం: బూరుగడ్డ పుష్పనగేష్

ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపు

**గుమ్మడిదల(రామచంద్రాపురం), సెప్టెంబర్ 10 (నేటి ప్రస్థానం):** సమాజంలో అణచివేతకు గురైన వర్గాలకు అండగా నిలిచి, హక్కుల కోసం ధైర్యంగా గళమెత్తిన చాకలి ఐలమ్మ జీవితం తెలంగాణ సమాజానికి నేటికీ మార్గదర్శకంగా నిలుస్తోందని రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అన్నారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకుని శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ సమీపంలోని ఐలమ్మ విగ్రహం వద్ద కాంగ్రెస్, రజక సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. బూరుగడ్డ పుష్పనగేష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో ఐలమ్మ పాత్ర విశిష్టమైనదని పేర్కొన్నారు. సాధారణ మహిళగా ప్రారంభమైన ఆమె ప్రస్థానం, అన్యాయాన్ని ప్రశ్నించే స్థాయికి ఎదిగి ప్రజల హక్కుల కోసం పోరాడిన చరిత్రగా మారిందన్నారు. ప్రజలపై పెత్తనం, దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ చూపిన తెగువ తెలంగాణ పోరాట చరిత్రలో చెరగని ముద్ర వేసిందని పుష్పనగేష్ తెలిపారు. ముఖ్యంగా బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన నిబద్ధత, ధైర్యం ఇప్పటికీ సమాజానికి స్ఫూర్తిని అందిస్తున్నాయని అన్నారు. కొత్త తరాలు ఐలమ్మ జీవితాన్ని తెలుసుకోవడంతో పాటు, ఆమె ఆశయాల వెనుక ఉన్న సామాజిక న్యాయ భావనను ఆచరణలోకి తీసుకురావాలని పుష్పనగేష్ సూచించారు. అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం, హక్కులు అందేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ పోరాట వారసత్వాన్ని కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ఆమె ఆశయాలను సమాజంలో కొనసాగించాలని కాంగ్రెస్, రజక సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలువురు ఐలమ్మ త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

### బీఆర్ఎస్వీ నాయకులు షోయబ్

మిర్యాలగూడ: తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్ సందేశి రజిని రాజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ. షోయబ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన చాకలి ఐలమ్మ పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఐలమ్మ చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు నల్లగంతుల నాగభూషణం, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాములు గౌడ్ ఉప సర్పంచ్ నారాయణదాసు, ఉద్యమ వీరుడు ప్రసాద్ మాలోతు ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.



# ఐదు స్వర్ణ పతకాలతో బొల్లారం పేరు నిలబెట్టిన నిఖిత

### ఉస్మానియా వర్సిటీ రసాయన శాస్త్రంలో అసాధారణ ప్రతిభ

### ఐడీఏ బొల్లారం ప్రాంతానికి చెందిన విద్యార్థినికి అరుదైన గుర్తింపు

### నిఖితను అభినందించి సత్కరించిన కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి

**గుమ్మడిదల (బొల్లారం), సెప్టెంబర్ 10 (నేటి ప్రస్థానం):** కష్టాలకు ఎదురొడ్డి చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఐడీఏ బొల్లారం విద్యార్థిని బేగంపేట నిఖిత అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో ఆమె ఐదు స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. సాధారణ కుటుంబ పరిస్థితుల నుంచి వచ్చిన ఒక విద్యార్థిని ప్రతిభతో ఈ స్థాయికి చేరుకోవడం



స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. నిఖిత తండ్రి ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తుండగా, పరిమిత ఆర్థిక పరిస్థితులను అధిగమిస్తూ ఆమె విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదువులో రాణించిన ఆమె తాజాగా ఉస్మానియా యూనివర్సిటీలో ఐదు బంగారు పతకాలు అందుకోవడం ద్వారా తన ప్రతిభను చాటుకున్నారు. ఈ విజయం బొల్లారం ప్రాంతంలోని విద్యార్థులు, యువతకు ప్రేరణగా నిలుస్తోంది. నిఖిత సాధించిన విజయాన్ని తెలుసుకున్న బొల్లారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆమె ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించి పూల మొక్కను బహూకరించారు. కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత విజయాలను అందుకోవచ్చని నిఖిత నిరూపించారని ఆయన పేర్కొన్నారు. ఐదు స్వర్ణ పతకాలు సాధించడం వ్యక్తిగత విజయానికే పరిమితం కాదని, మొత్తం బొల్లారం ప్రాంతానికి గౌరవాన్ని తీసుకొచ్చిన ఘనత అని కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి అన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు కుటుంబ ఆర్థిక స్థితి అడ్డంకి కాకూడదని, నిఖిత ప్రయాణం అందుకు మంచి ఉదాహరణగా నిలిచిందని తెలిపారు. రసాయన శాస్త్రంలో మరింత ఉన్నత విద్యను అభ్యసించి పీహెచ్‌డీ పూర్తి చేయడంతో పాటు పరిశోధనా రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని నిఖితను ఆయన ఆకాంక్షించారు. ఆమె తదుపరి విద్యా ప్రయాణంలో ఎదురయ్యే అవసరాలకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఒక కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ప్రస్తుత తరం విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి తల్లిదండ్రుల శ్రమను సార్థకం చేయాలని కేజేఆర్ సూచించారు. సౌకర్యాలు తక్కువగా ఉన్నా ప్రతిభను నిరూపించుకోవడానికి అవకాశాలు ఎన్నో ఉన్నాయని, నిఖిత సాధించిన ఫలితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని బొల్లారం విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రాంతంలో చదువుకు సంబంధించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే విద్యార్థులకు తన పరిధిలో సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన వెల్లడించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమపద్ధతిలో కృషి చేస్తే మరిన్ని విజయాలు సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు టీ. రవీందర్ రెడ్డి, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని... నిఖిత విద్యా విజయాన్ని వారు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మాటల రాజకీయాలకు దూరంగా.. ప్రజల సమస్యలపై బీజేపీ పోరాటం

## రైల్వే అంశాలపై స్పందిస్తున్న ఎంపీ రఘునందన్‌రావుకు ఉదయ్‌కుమార్ ప్రశంసలు

### ప్రజా అవసరాలను గుర్తించి పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి

### రాజకీయ విమర్శల కంటే క్షేత్రస్థాయి సమస్యలకే ప్రాధాన్యం



**గుమ్మడిదల, సెప్టెంబర్ 10 (నేటి ప్రస్థానం):** ప్రజలకు నేరుగా ఉపయోగపడే అంశాలపై ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని మైత్రి ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ నాయకుడు చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వేకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తున్న మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు తీరును ఆయన అభినందించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను గుర్తించి సంబంధిత ప్రభుత్వ విభాగాలతో మాట్లాడటం ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషించడమే రాజకీయ వ్యవస్థలో ప్రజలకు ఉపయోగపడే విధానమని ఉదయ్‌కుమార్ అన్నారు. ఈ విషయంలో బీజేపీ నాయకత్వం ప్రజలతో మమేకమై స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ప్రజా అంశాలపై దృష్టి పెట్టకుండా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజల అవసరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కాకుండా రాజకీయ పరస్పర విమర్శలు కొనసాగడం వల్ల సామాన్యులకు ప్రయోజనం ఉండదన్నారు. ఉమ్మడి మెదక్ ప్రాంతంలో రైల్వేకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ రఘునందన్‌రావు సంబంధిత రైల్వే శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారని ఉదయ్‌కుమార్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని పేర్కొంటూ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రవాణా సదుపాయాలు, మౌలిక వసతులు, ప్రజల రోజువారీ అవసరాలకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ స్పష్టం చేశారు.

# కానుకుంటలో ఐలమ్మకు ఘన నివాళి..

## పోరాట స్ఫూర్తిని చాటిన బీజేపీ

### కానుకుంటలో బీజేపీ ఆధ్వర్యంలో వీరనారి వర్ధంతి కార్యక్రమం

### అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటానికి స్మరణ

### చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, గ్రామస్తులు



గుమ్మడిదల, సెప్టెంబర్ 10 (నేటి ప్రస్థానం): అణచివేతకు ఎదురు నిలిచి సామాన్యుల హక్కుల కోసం పోరాడిన చాకలి ఐలమ్మ జీవితం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమేనని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకుని గుమ్మడిదల మండలం కానుకుంటలో పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పుష్పాలతో ఘనంగా నివాళి సమర్పించారు. సామాజిక వివక్ష, దోపిడీ వంటి సమస్యలపై ఐలమ్మ ప్రదర్శించిన తెగువ తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని బీజేపీ మండల అధ్యక్షుడు చింతల యాదగిరి అన్నారు. అణగారిన ప్రజల కోసం ఆమె చేసిన పోరాటం నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. ప్రతికూల పరిస్థితులను లెక్కచేయకుండా హక్కుల సాధన కోసం ముందుకు సాగిన ఐలమ్మను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం, సమాన అవకాశాలు లభించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ జీవిత సందేశాన్ని కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ఆచరణలోకి తీసుకురావాలని బీజేపీ నాయకులు అన్నారు. అణగారిన వర్గాలకు చెందిన ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని సామాజికంగా, ఆర్థికంగా ముందుకు వెళ్లేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు నర్సపల్లి రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పలుగు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమొల్ల యాదగిరి, ఉపాధ్యక్షుడు అందిపురం రాజు, బూత్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, మోర్చా అధ్యక్షుడు అనిల్ రెడ్డి, శివశంకర్, సత్యనారాయణ, ఆంజనేయులు, రజక సంఘం అధ్యక్షుడు నర్సంగారి శేఖర్, నర్సంగారి మురళి, సుధాకర్, వెంకటేష్, లక్ష్మణ్, నరేష్, కృష్ణ, జనార్దన్, అనిల్, బాను, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. రజక సంఘం సభ్యులతో పాటు గ్రామానికి చెందిన పలువురు కార్యక్రమానికి హాజరై ఐలమ్మకు నివాళులు అర్పించారు. ఆమె ఆశయాలు, ధైర్యసాహసాలను స్మరించుకుంటూ సమాజంలో సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం ముందుకు సాగాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.







# మేడ్చల్‌లో వైద్య సేవలపై అనుమానాలు

## స్వరూప నర్సింగ్ హోమ్‌లో ఎంబీబీఎస్ వైద్యుల పేర్లు.. చికిత్స చేసేది ఎవరు?

**మేడ్చల్**

**మేడ్చల్‌లోని స్వరూప నర్సింగ్ హోమ్‌లో వైద్య సేవల నిర్వహణపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో ఎంబీబీఎస్ వైద్యుల పేర్లు ప్రదర్శిస్తున్నప్పటికీ.. వాస్తవంగా రోగులకు చికిత్స అందిస్తున్నది అర్హత కలిగిన వైద్యులేనా? లేక ఆర్ఎంపీలేనా? అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

దీంతో ఆసుపత్రిలో వైద్య సేవల నిర్వహణపై సమగ్ర తనిఖీ చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యులు ఎవరు, వారి హాజరు వివరాలు ఏమిటి, డ్యూటీ రోస్టర్ ఎలా నిర్వహిస్తున్నారు, రోగులను పరీక్షిస్తున్నది ఎవరు అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యంగా ఆసుపత్రిలో ప్రదర్శిస్తున్న ఎంబీబీఎస్ వైద్యులు వాస్తవంగా విధుల్లో ఉంటున్నారా? ఉంటే ఏ సమయాల్లో సేవలు అందిస్తున్నారు? అనే వివరాలు పరిశీలించాల్సి ఉంది.



### డ్యూటీ డాక్టర్ ఎవరు?

ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు వచ్చే రోగికి అర్హత కలిగిన వైద్యుడు అందుబాటులో ఉండటం అత్యంత కీలకం. అయితే స్వరూప నర్సింగ్ హోమ్‌లో డ్యూటీ డాక్టర్‌కు సంబంధించిన వివరాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ సమయంలో ఏ వైద్యుడు విధుల్లో ఉన్నారు? వైద్యుల హాజరు రిజిస్టర్ నిర్వహిస్తున్నారా? రోగులను పరీక్షించిన వైద్యుల వివరాలు నమోదు చేస్తున్నారా? అనే అంశాలపై అధికారుల పరిశీలన అవసరమని స్థానికులు కోరుతున్నారు.

### రికార్డులపై కూడా సందేహాలు

ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల అర్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలు, హాజరు, డ్యూటీ సమయాలు, సిబ్బంది వివరాలు వంటి రికార్డులు కీలకం. ఈ రికార్డులను అధికారులు పరిశీలిస్తే ఆసుపత్రిలో వైద్య సేవలు ఏ విధంగా కొనసాగుతున్నాయనే దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ముఖ్యంగా ఆర్ఎంపీలు రోగులకు చికిత్స అందిస్తున్నారనే ఆరోపణలు నిజమా? కాదా? అన్నది కూడా అధికారుల తనిఖీలో తేలాల్సి ఉంది. ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసు కోవాల్సి ఉంటుం ది. ఆరోపణలు నిరాధా రమని తేలితే ఆసుపత్రి యాజమాన్యం, అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది.

### ఆరోగ్యశాఖ తనిఖీ చేయాలని డిమాండ్

స్వరూప నర్సింగ్ హోమ్‌లో వైద్య సేవలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. తనిఖీ సమయంలో విధుల్లో ఉన్న వైద్యులు, వారి అర్హతలు, సిబ్బంది వివరాలు, డ్యూటీ రికార్డులు, రోగుల వైద్య రికార్డులను పరిశీలించాలని వారు అంటున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో ఆరోపణలను తేలిగ్గా తీసుకోకుండా వాస్తవాలను అధికారులు నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు.

### యాజమాన్యం వివరణ రావాల్సి ఉంది

ఇదిలా ఉండగా, స్వరూప నర్సింగ్ హోమ్‌పై వినిపిస్తున్న ఆరోపణలపై ఆసుపత్రి యాజమాన్యం నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది. అలాగే సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆసుపత్రిని తనిఖీ చేసి ఉంటే దానికి సంబంధించిన వివరాలను వెల్లడించాల్సి ఉంది. ప్రస్తుతం ఆసుపత్రిపై వినిపిస్తున్న ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కాలేదు. లి ఆరోపణల్లో వాస్తవం ఎంత అన్నది యాజమాన్యం వివరణ, అధికారుల తనిఖీ అనంతరం మాత్రమే స్పష్టమయ్యే అవకాశం ఉంది. అయితే ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో ఆసుపత్రిలో వైద్య సేవలు ఎవరి పర్యవేక్షణలో కొనసాగుతున్నాయనే దానిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.




# క్రీడా మైదానంలోనూ రాణించాలి..

## 339 మంది విద్యార్థులకు అండగా సీజీఆర్ ట్రస్ట్

### మూడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

### చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సంధ్య గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

### గ్రామీణ ప్రాంతాల క్రీడా ప్రతిభను వెలికితీయడమే కార్యక్రమం ఉద్దేశం





గుమ్మడిదల, సెప్టెంబర్ 10 (నేటి ప్రస్థానం): గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు క్రీడల్లో మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సీజీఆర్ ట్రస్ట్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మూడు పాఠశాలలకు చెందిన 339 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్‌రెడ్డి విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. గుమ్మడిదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 136 మందికి, అనంతారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 63 మందికి, కానుకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 140 మందికి దుస్తులు పంపిణీ చేశారు. మూడు విద్యాసంస్థల్లో కలిపి 339 మంది విద్యార్థులు ఈ సదుపాయాన్ని పొందారు. చదువుతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్నప్పటికీ అవసరమైన సదుపాయాలు, ప్రోత్సాహం అందక వెనుకబడుతున్న విద్యార్థులకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో క్రమశిక్షణతో పాటు పట్టుదల, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని నిర్వాహకులు అన్నారు. తమకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుని క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు. గోవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా తమకు క్రీడా దుస్తులు అందించడం పట్ల ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ ట్రస్ట్ సభ్యులు, పాఠశాలల ఉపధ్యాయులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

